మనం
కృష్ణా-గుంటూరు
ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల
శుక్రవారం - 27- ఫిబ్రవరి - 2026 పేజీలు-4

# దుర్గమ్మ అన్నదాన పథకానికి విరాళం



**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 26 ( మనం న్యూస్)** ఇంద్రకీలాద్రి పై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం. అన్నదాన పథకానికి విరాళం దాత పొపూరి పద్మజ కుమార్తె రాధాకృష్ణమూర్తి వైష్ణవి, శశాంక్ (కుటుంబ సభ్యులు) విరాళం మొత్తం: రూ. 1,08,116/- (అక్షరాలా లక్షా ఎనిమిది వేల నూట పదహారు రూపాయలు మాత్రమే) 3వ వార్డు, కల్యాణ మండపం ఎదురుగా, రవి చెట్టు బజార్, ఉయ్యూరు - 521165. ఆలయ అధికారులు అమ్మవారికి దర్శనం కల్పించి. వేద పండితులు వేద ఆశీర్వచనం అమ్మవారి చిత్రపటం ప్రసాదం ప్రసాదం అందజేశారు

# పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు..

## ఈవీఎం, వీవీప్యాట్ గోదాము వద్ద నిరంతర పర్యవేక్షణ....జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ రూరల్ ఫిబ్రవరి 26 (మనం న్యూస్):** ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి



అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ సీఈవో, ఈవీఎంల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, కందుల పరమేశ్వర రావు (ఆమ్ ఆద్మీ పార్టీ), జె.శ్రీనివాసరావు (జనసేన), బి.కృష్ణారెడ్డి (బీజేపీ), సురేష్ సిపిఐ (ఎం), కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటి తహశీల్దార్ ఎ.ఎస్.ఆర్ గోపాల రెడ్డి ఉన్నారు.

# బందరు ఓడరేవుకు రైల్వే వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే ఇవ్వాలి

## సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలు



**మచిలీపట్నం, ఫిబ్రవరి 26(మనం న్యూస్) :** బందరు ఓడరేవుకు అనుసంధానంగా నిర్మించాల్సిన రైల్వే వంతెనలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని తన కార్యాలయ గదిలో ఆదాయ, రైల్వే, రహదారులు-భవనాలు తదితర శాఖల అధికారులతో వంతెనల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బందరు ఓడరేవుకు అనుసంధానంగా రైల్వే పైవంతెనతో పాటు రైల్వే దిగువ వంతెనలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన అంచనాలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలను సంబంధిత రహదారులు-భవనాల శాఖ అధికారులు సిద్ధం చేసి వెంటనే అందజేయాలని సూచించారు. అలాగే భూసేకరణకు అవసరమైన స్థలాల వివరాలు, వాటి విలువల అంచనాలను ఆదాయ శాఖ అధికారులు సమర్పించాలని, విద్యుత్ సరఫరా మార్పులు మరియు ఇతర అవసరాలపై ప్రతిపాదనలను విద్యుత్ శాఖ అధికారులు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఆదాయ అధికారి చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆదాయ విభాగ అధికారి పోతురాజు, గ్రామీణ జలసరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సోమశేఖర్, రహదారులు-భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు లోకేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దార్శనికతకు అనుగుణంగా ఎన్‌హెచ్-65 విస్తరణ

## భవిష్యత్తు అవసరాల మేరకు రహదారి అభివృద్ధి...
## నవ్యరాజధానికి అనుసంధానంగా ఎన్‌హెచ్ నెట్‌వర్క్...
## విజయవాడ నగర రద్దీకి అనుగుణంగా పై వంతెనలు
## ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై భాగస్వాముల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ కలెక్టరేట్ ఫిబ్రవరి 26 ( మనం న్యూస్) :** రాష్ట్ర నవ్య రాజధాని అమరావతి, విజయవాడ నగర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ముఖ్యమని.. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్-65 విస్తరణ ఉండాలని కోరుకుంటున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.

గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాతీయ రహదారి ప్రాజెక్టులపై భాగస్వాముల (స్టేక్‌హోల్డర్స్) సమావేశం జరిగింది. జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు బోడె ప్రసాద్, వసంత వెంకట కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, గద్దె రామ్మోహన్‌రావు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు పాల్గొన్నారు. నేషనల్ హైవే-65 ఆరు వరుసల విస్తరణకు సంబంధించిన ప్రణాళికలపై చర్చిం చారు. విస్తృత ప్రజాప్రయోజనా లతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రైతుల ప్రయోజనాలకు ఇబ్బందిలేకుండా పనులు జరగాల్సి ఉందన్నారు.

వివరాలు 3 లో..



# ఎన్‌సిసి లెజెండరీ ఉమెన్ ఎలిజబెత్‌రాణికి ప్రతిష్టాత్మక పురస్కారం



వివరాలు 3 లో..

# ఆలయాలు ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలు..స్వామి పరిపూర్ణానంద

**తాడంకిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ పీఠం వ్యవస్థాపకులు, పరిపూర్ణానంద స్వామీజీ**



**ఉయ్యూరు ఫిబ్రవరి 26 (మనం న్యూస్)** :కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు భక్తజన జయ జయ ద్వానాలు నడుమ గురువారం వైభవంగా జరిగాయి. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీపీఠం వ్యవస్థాపకులు, పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి అమృత హస్తముల మీదుగా దేవాలయ విగ్రహాల దివ్య నూతన యంత్ర ప్రతిష్టాపనలు శాస్రోక్తంగా నిర్వహించబడ్డాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ, ఆగమ శాస్త్ర విధానాలను అనుసరించి ప్రతిష్టా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. బ్రహ్మశ్రీ కుందుర్తి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలోని వేద పండితుల బృందం ప్రతిష్ట క్రతువులను,పూజోత్సవాల ఆగమానుసారం నిర్వహించారు.

ఈ సందర్భంగా పూజ శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేస్తూ, "గ్రామాలలో దేవాలయాలు కేవలం ఆరాధనా కేంద్రాలు మాత్రమే కాకుండా, సమాజాన్ని ధర్మ మార్గంలో నడిపించే శక్తి కేంద్రాలు అని పేర్కొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి కృపతో ఈ ఆలయం తాడంకి గ్రామానికి ఆధ్యాత్మిక వెలుగును ప్రసాదిస్తుందని ఆశీర్వచనాలు అందించారు. భక్తులు సత్ సత్సంకల్పంతో, సద్గుణాలతో జీవించాలని పరిపూర్ణానంద ప్రబోధించారు. రామనామ స్మరణతో మన జీవితం శాంతిమయంగా మారుతుంది" అని స్వామీజీ అన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను, గ్రామ పెద్దలను స్వామీజీ ప్రత్యేకంగా అభినందించారు. మరో చిన్న అయోధ్యగా తాడంకి రామాలయం ముచ్చటగా బాసిల్లుతుందని పరిపూర్ణానంద మంగళ శాసనాలను అందించారు.

కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ జంపాన పూర్ణిమ, జడ్పిటిసి ఏనుగ రమణకుమారి, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసంతర్పణ జరిగింది. దాదాపు 8,000 మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. ఈ ప్రతిష్టా మహోత్సవాలు గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

# నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు కూటమి ప్రభుత్వం కృషి

**-మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26 (మనం న్యూస్)** : ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక కార్యాచరణతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కిలేశపురం గ్రామంలో రూ. 4.2 కోట్ల హడ్కో నిధులతో 33/11 కెవి విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ కిలేశపురం గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందుచూపుతో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. దీనివల్ల లో ఓల్టేజీ, బ్రేక్ డౌన్ సమస్య తీరిపోనున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలనే ప్రధాన లక్ష్యంతో విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రానున్న వేసవి దృష్ట్యా విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా తగు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ కనకదుర్గమ్మ మహాకుంభాభిషేకానికి కంచి పీఠాధిపతులకు ఆహ్వానం



**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 26 ( మనం న్యూస్)** : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో త్వరలో నిర్వహించ తలపెట్టిన. పవిత్రమైన 'మహాకుం భాభిషేక' మహోత్సవానికి సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతులను ఆహ్వానించేందుకు దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి (జు.గా) వి.కె. సీనా నాయక్ నేడు కంచి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా కంచి మహాస్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలిసి, పాదాభి వందనం చేసి మహాకుంభాభిషేక ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో జరగనున్న ఈ మహాక్రతువుకు విచ్చేసి భక్తులను అనుగ్రహించాలని వారు మహాస్వామి వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మర్యాదలతో మహాస్వామి వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేయడం జరిగింది. మహాకుంభాభిషేకం ద్వారా ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుందని, దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పీఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆలయ అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# నీట్ పరీక్షలకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**మే 3న రెండు కేంద్రాల్లో నిర్వహణ : కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం, ఫిబ్రవరి 26 (మనం న్యూస్)**: వచ్చే మే 3వ తేదీన జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గురువారం న్యూఢిల్లీ నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ రాజేష్ లఖన్ రాష్ట్ర ప్రభుత్వ కళాశాల విద్య కమిషనర్ భరత్ గుప్తాతో కలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో దూరదర్శి సమావేశం నిర్వహిం చారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ నగరంలోని తన శిబిర కార్యాలయం నుండి సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహించనున్న కేంద్రాలు: కేంద్రీయ విద్యాలయం కృష్ణా విశ్వవిద్యాలయం పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా జరిగేలా భద్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్, నీట్ పరీక్షల జిల్లా సమన్వయకర్త మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్, పరీక్షా కేంద్ర పర్యవేక్షకులు సత్యనారాయణ పాల్గొన్నారు.



# శ్రీ కనకదుర్గమ్మ మహాకుంభాభిషేకానికి కంచి పీఠాధిపతులకు ఆహ్వానం



**కంచిలో పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న చైర్మన్ మరియు ఈవో**

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 (మనం న్యూస్)** : ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించ తలపెట్టిన 'మహాకుంభాభిషేక' మహోత్సవానికి ఆహ్వానించేందుకు కంచి క్షేత్రానికి వెళ్లిన దేవస్థాన చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఆలయ ఈవో వి.కె. సీనా నాయక్ (స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్)కి అరుదైన ఆధ్యాత్మిక అవకాశం లభించింది.

కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి వారిని దర్శించుకుని ఆహ్వాన పత్రికను అందజేసిన అనంతరం, అక్కడ నిర్వహించిన స్వామివారి పల్లకీ ఊరేగింపు సేవలో వారు స్వయంగా పాల్గొన్నారు. భక్తిప్రపత్తులతో పల్లకీని మోస్తూ, స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ఈ సందర్భంగా చైర్మన్ మరియు ఈవో మాట్లాడుతూ, "అమ్మవారి ఆహ్వాన పత్రికను అందజేయడానికి వచ్చిన వేళ, సాక్షాత్తు కంచి పరమాచార్యుల పల్లకీ సేవలో పాల్గొనే భాగ్యం కలగడం మా పూర్వజన్మ సుకృతం. ఇది మహాకుంభాభిషేక మహోత్సవానికి లభించిన శుభ సంకేతం" అని హర్షం వ్యక్తం చేశారు. కంచి మహాస్వామి వారు కూడా ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించి, విజయవాడ దుర్గమ్మ ఆలయ విశిష్టతను కొనియాడారు.

# జావెలిన్ త్రో మరియు షాట్‌పుట్ పోటీల్లో తొలి స్థానం సాధించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)




**జగ్గయ్యపేట ఫిబ్రవరి 26 మనం న్యూస్**: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా నిర్వహించిన ఏ పీ అసెంబ్లీ క్రీడా మహోత్సవాలలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తన ప్రతిభను చాటారు. శాసన సభ్యులకు నిర్వహించిన పోటీలలో జావెలిన్ త్రో మరియు షాట్‌పుట్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి తొలి స్థానం సాధించి విజేతగా నిలిచారు. క్రీడల పట్ల తన ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో యువతకు ఆదర్శంగా నిలిచిన ఎమ్మెల్యే రాజగోపాల్ ని క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

# మరణించిన రైతు కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం

**సహకార బ్యాంకు తరపున అందజేత :రైతు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ**



**మచిలీపట్నం, ఫిబ్రవరి 26(మనం న్యూస్)** : మచిలీపట్నం మండలం కానూరు గ్రామపంచాయతీకి చెందిన మరణించిన చిటికినేటి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గోపు ప్రతాప్ నరేష్ కుమార్ కలిసి సహకార బ్యాంకు తరపున రూ. 10,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తం మట్టికర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు కుటుంబాలకు ఇలాంటి అనుకోని సమస్యలు ఎదురైనప్పుడు సహకార బ్యాంకు రుణ సభ్యులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గోపు ప్రతాప్ నరేష్ కుమార్, శ్రీ గోపు సత్యనారాయణ, గోపు వెంకటరావు, సంఘ కార్యదర్శి అడపాల శ్రీనివాసరావు, జొన్నల నాగ మల్లేశ్వరరావు, సిదిరెడ్డి పాండురంగారావు, అల్లం వెంకటేశ్వరరావు, చిటికినేటి నాగరాజు, గోపు కనక పెద్దిరాజులు, బొల్లిశెట్టి రంగా, వీర శ్రీనివాసరావు, వీర అలీ బాబు, చిటికినేటి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి లెజెండరీ ఉమెన్ ఎలిజబెత్‌రాణికి ప్రతిష్టాత్మక పురస్కారం

**ఉయ్యూరు ఫిబ్రవరి 26 (మనం న్యూస్ ):** ఉయ్యూరు పట్టణంలోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల 16 (ఎ) ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి కెప్టెన్ వేమూరి ఎలిజబెత్‌రాణి ప్రతిష్టాత్మక లెజెండరీ ఉమెన్ అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల 16 (ఎ) ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి కెప్టెన్ హోదాలో ఆమె గత 18 సంవత్సరాలుగా ఎందరో యువతీ యువకుల్లో దేశభక్తి భావం, జాతీయ సమైక్యత, ఐక్యత, అభివృద్ధి, క్రమశిక్షణ, దేశ రక్షణ వంటి అంశాలపై అవగాహన పెంపొందించటంతోపాటుగా నాయకత్వ లక్షణాలను పెంపొదిస్తున్నారు. ఆమె 'నేషనల్ ఉమెన్ ఎక్సలెన్స్–2026–మహిళాకీర్తి రత్న' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీభూషణం అవార్డుకు ఎంపికచేసినట్లుగా ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి మూడోతేదీన విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. సమాజ హితం కోసం, దేశసమగ్రత, సౌభాగ్యం కోసం యువతలో ఆదర్శ భావాలు పెంపొందించటంలో ఆమె ఎంతో గురుతరమైన బాధ్యతను పోషిస్తున్నారు. కేడెట్లలో నిబిడీకృతమైన సృజనాత్మక శక్తులను వెలికితీసి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నారు. దేశంకోసం, సమాజంకోసం పాటుపడాల్సిన ఆవశ్యకతను గుర్తుచేయటంలోనూ, వారిలో ఆ విధమైన స్ఫూర్తిని నింపటంలోనూ ఇదోధికంగా కృషిచేస్తున్నారు. దేశరక్షణకు కావాల్సిన యువతరాన్ని, దేశ భద్రతకు అవసరమైన సైన్యాన్ని, భావి నాయకత్వాన్ని దేశానికి అందించటంలో ఎన్‌సిసి ద్వారా ఆమె అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజహితమైన అనేక సేవలను అందిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించటంతోపాటు జాతీయ




సామరస్యం కాపాడటంతోపాటుగా, దేశానికి మంచి సేవ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఏటేటా పండగులు, ఉత్సవాలు, విపత్తులు జరిగినప్పుడు ఎన్‌సిసి కేడెట్ల ద్వారా ప్రభుత్వ పరమైన కార్యక్రమాలకు సహాయపడేలా ప్రోత్సహిస్తున్నారు. దేశరక్షణకు అవసరమయ్యే భావి సైన్యాన్ని ఎన్‌సిసి ఎ,బి,సి సర్టిఫికెట్ల ద్వారా శిక్షణలో ప్రోత్సహిస్తున్నారు. ఫైరింగ్, ట్రెక్కింగ్ వంటి సాహసకృత్యాల్లో ప్రోత్సహిస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ విబేధాలకు అతీతంగా సమైక్యతా భావాన్ని ఎన్‌సిసి కేడెట్లలో పెంపొందిస్తూ గురుతరమైన పాత్రను పోషిస్తున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏటేటా వృద్ధులు, మహిళలకు దుస్తుల పంపిణీ చేస్తున్నారు. పేద విద్యార్థులకు చదువునిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. రిపబ్లిక్ డే, ఇండిపెండెంట్స్ డే, యూత్ ఎక్స్ఛేంజ్ పోగ్రామ్స్‌తోపాటుగా స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ (ఎస్ఎన్ఐ), నేషనల్ ఇండిగ్రేషన్ క్యాంప్ (ఎస్ఐసి), అడ్వాన్స్‌డ్ లీడర్ క్యాంప్, ట్రెక్కింగ్, ఆర్మీ అటాచ్‌మెంట్ కార్యక్రమాల్లో ఎన్‌సిసి కేడెట్లు ఉత్సాహంగా పాల్గనటంలో ప్రోత్సహిస్తున్నారు. ఎన్‌సిసి ఎ,బి,సి సర్టిఫికెట్ల కోర్సుకు ప్రిపేర్ అవుతున్న కేడెట్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఎన్‌సిసి ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి విభాగాల్లో లభించే ఉద్యోగ అవకాశాలపై కూడా నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు.

# జగ్గయ్యపేటలో జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

### జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి పట్టణంలో తొలి సభ్యత్వం నమోదు చేసుకున్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 26 మనం న్యూస్ :** జనసేన పార్టీ బలోపేతమే ధ్యేయంగా, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం జగయ్యపేట పట్టణంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను తనయులు యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ జగ్గయ్యపేట పట్టణంలో స్థానిక బస్ స్టాండ్ సమీపంలో ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం కృష్ణ ప్రసాద్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పల్లె, ప్రతి వార్డులో జనసేన సిద్ధాంతాలను నమ్మే జన సైనికులను ఏకం చేసే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. 2014లో కేవలం 150 మందితో మొదలై, నేడు 13 లక్షల మందికి పైగా సభ్యులతో బలమైన శక్తిగా ఎదిగిన జనసేన, మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందని ఆయన తెలియజేశారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల క్షేమమే ధ్యేయంగా, ప్రతి క్రియాశీలక సభ్యునికి రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తోంది అన్నారు. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని పార్టీ నిధి నుండే చెల్లిస్తారని తెలియజేసి ఇందుకోసం ఇప్పటికే తన వంతుగా రూ. 2కోట్ల భారీ విరాళాన్ని పార్టీకి అందజేసిన జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు వీర మహిళలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# స్వర్ణాంధ్ర 2047 ఫిబ్రవరి 2026 మాసపత్రిక ఆవిష్కరించిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 26 మనం న్యూస్ :** జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించిన స్వర్ణాంధ్ర 2047 మాసపత్రికను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తమ నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర 2047 విజన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే దిశగా రూపొందించబడిందని పేర్కొన్నారు. విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, సాంకేతికత వంటి కీలక రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం అభివృద్ధి కూడా ఈ విజన్‌లో కీలక భాగమని, నియోజకవర్గ ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాలను



సాధించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్ తెలిపారు. మాసపత్రిక ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు, ప్రజలకు చేరువయ్యే సమాచారాన్ని సులభంగా అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిల్ సభ్యురాలు పి సుందరమ్మ , పలువురు ప్రముఖులు, అధికారులు నేతలు పాల్గొన్నారు.

# శ్రీ గోవిందమాల ..భక్తసమాజం ఆధ్వర్యంలో అన్న వితరణ

**గాంధీనగర్, ఫిబ్రవరి26 మనం న్యూస్ :** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో గురువారం కమిటీ సభ్యులు పుప్పాల అ–ప్పారావు చేతుల మీదుగా పూజ కార్యక్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాత వాకా అఖిల సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, గద్దల ధనలక్ష్మి, దత్తి జ్యోతి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కి విజ్ఞప్తి

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 (మనం న్యూస్) :** విజయవాడలో జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జి అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో మా మిత్రమండలి ప్రతినిధులు మరియు రాధా రంగా మిత్ర మండలి నాయకులు ముళ్ళపూడి నాగేశ్వర రావు, అల్లు రామ్మోహన్ రావు, ఆర్టీఓ శ్రీనివాస్, బడే శ్రీను, వడ్లమూడి రమేష్, టైలర్ శ్రీను, మత్తి సాంబశివరావు తదితరులు కృష్ణలంకలో రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి విజయవాడలో బస్టాండ్ వద్ద కంట్రోల్ రూమ్ కు ఎదురుగా వున్న ఫ్లై ఓవర్ ఎక్కేటప్పుడు ఎడమ ప్రక్కన వున్నటువంటి



పార్క్ లో గల ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేయుటకు పర్మిషను ఇవ్వవలసిందిగా వినతి పత్రం అందించారు. విజయవాడ నగర ప్రజలు చిరకాలముగా మున్సిపల్ కౌన్సిల్ ను అనేకసార్లు కోరుతున్నప్పటికి ఎప్పటికప్పుడు తదుపరి వచ్చే కౌన్సిల్లో దీని గురించి నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. ఇప్పటివరకు చెప్పి, యిప్పుడు కౌన్సిల్ టైమ్ చివరకు వచ్చేటప్పటికి కౌన్సిల్ సభ్యులలో కొంతమంది రాజకీయ కారణాల వలన ఉద్దేశ్యపూర్వకముగా ఈ తీర్మానాన్ని అడ్డుకుంటున్నారన్నా విషయాన్ని మంత్రి దృష్టికి వారు తీసుకువెళ్లారు. ఈ విషయంపై మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పడం శుభ సూచకమని మా మిత్రమండలి మరియు రాధా రంగా మిత్రమండలి ప్రతినిధులు తెలియచేశారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న. అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్

**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్ర వరి 26 (మనం న్యూస్) :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అమ్మవారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ ఏజీ దమ్మలపాటి శ్రీనివాస్ దంపతులు ఆలయ అధికారులు మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేశారు.



దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించగా, అధికారులు అమ్మవారి శేషవస్త్రాన్ని మరియు ప్రసాదాన్ని అందజేశారు.

# దార్శనికతకు అనుగుణంగా ఎన్‌హెచ్-65 విస్తరణ

మొదటి పేజీ తరువాయి

సమావేశం అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు సంబంధించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్–విజయవాడ–మచిలీపట్నం ఎన్‌హెచ్ 65 విస్తరణకు సంబంధించి కొంతవరకు డీపీఆర్ తయారైందని.. ఈ డీపీఆర్‌ను పరిశీలించిన మీదట ఎక్కువమంది రైతులు ఇబ్బందిపడే అవకాశమున్నందున విస్తరణలో ప్రతిపాదించిన రెండు బైపాసులు (అంబారిపేట–ఐతవరం; కాచవరం–మూలపాడు–ఇబ్రహీంపట్నం వెస్ట్) బదులు పాత రహదారినే పటిష్ట ప్రణాళికతో విస్తరణతో అభివృద్ధి చేయాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. సూర్యాపేట, నకిరేకల్ తరహాలో ఎక్కడైనా ఊర్ల గుండా వెళితే ఆయా ప్రాంతాల్లో పై వంతెనలు వేస్తూ పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. విజయవాడ నగరంలో కనకదుర్గమ్మ వారి ఫ్లై ఓవర్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు అదేవిధంగా బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు వరకు ఆరు వరుసల పై ఓవర్లు వేయాల్సి ఉందన్నారు. నగరంలోని అమెరికన్ హాస్పిటల్, వైవీ రావు హాస్పిటల్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఎన్‌హెచ్‌ను ఎంజీ రోడ్డుకు అనుసంధానించడం కూడా ముఖ్యమన్నారు. గొల్లపూడి–జక్కంపూడి కాలనీ వరకు ఉన్న హైవే రోడ్డుకు సంబంధించి 3.5 కి.మీ. మేర స్లిప్ రోడ్డు ఇవ్వమని కోరుతున్నామని.. దీనివల్ల ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 65, నాగపూర్



హైవేలకు అనుసంధానానికి దోహదం చేస్తుందని వివరించారు. ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్ 16 కలిసే చోట ఒక క్లోవర్ లీఫ్ అవసరమని పేర్కొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో నివేదికను ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి, నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. రాబోయే కాలంలో చక్కటి జాతీయ రహదారుల నెట్వర్క్ ఉండేలా చొరవ చూపనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ (విజయవాడ) ఎం.విద్యాసాగర్, ఎన్‌హెచ్ పీడీ (హైదరాబాద్) సీహెచ్ శ్రీనివాసరావు, పీడీ (అమరావతి) టి.పార్వతీశం, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్-2026కు పూర్తిస్థాయిలో సన్నద్ధత.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ కలెక్టరేట్ ఫిబ్రవరి 26 (మనం** న్యూస్)నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ గురువారం నీట్–2026 పరీక్ష నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై సమగ్ర నివేదికను సమర్పించారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన కేంద్రాలను సిద్ధంగా ఉంచడం, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ జిల్లాలో పరీక్ష నిర్వహణను సీసీటీవీల ద్వారా పర్యవేక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పరీక్ష పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా నీట్ పరీక్షల సమన్వయకర్త డా. ఎం.గోపీకృష్ణ పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన సిబ్బంది సమన్వయం, కేంద్రాల పర్యవేక్షణ తదితర అంశాలపై ఆయన వివరాలు తెలియజేశారు. జిల్లాలో నీట్––2026 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర సన్నద్ధతతో ఉందని అధికారులు తెలిపారు.

## భూషణం మరణం పార్టీకి తీరని లోటు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ


**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 26 ( మనం న్యూస్) :** గురువారం ఉదయం పట మటలంకలోని బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి గద్దె అనురాధ నివాళులు అర్పించారు. కు టుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపార నూతులపాటి నాగ భూషణం మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అలాగే టి.ఎన్.ఎస్.ఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడిగా ఆయన పార్టీ అభివృద్ధికి విశేషంగా సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని గద్దె అనురాధ తెలిపారు.



## విజయవాడ సెంట్రల్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సెకండ్ ఫ్లైఓవర్ అత్యవసరం.

### ఏపీ అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు గళం

**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 26 (మనం న్యూస్) :** గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు .సింగ్ నగర్ నుండి పాతపాడు, నున్న, గన్నవరం ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రతిరోజూ లక్ష మందికి పైగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు అని, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభలో వివరించారు..



1996 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు హయాంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో కీలకమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి (=ాదీ) నిర్మించబడిందని గుర్తుచేశారు, ఆ సమయంలో ఆ ప్రాంత జనాభా సుమారు 50 వేల మంది మాత్రమే ఉండేదని...

అయితే ప్రస్తుతం అదే ప్రాంతంలో 2 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని, అభివృద్ధి మరియు పట్టణ విస్తరణతో ఈ రహదారి ప్రధాన కనెక్టివిటీ మార్గంగా మారిందని, పాతపాడు, గన్నవరం, నున్న ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఇదే మార్గాన్ని వినియోగించడం వల్ల ట్రాఫిక్ ఒత్తిడి మరింత పెరిగిందన్నారు..

ప్రజల సమయం వృథా కావడం, అత్యవసర సేవలకు అంతరాయం కలగడం, ప్రమాదాల ప్రమాదం పెరగడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో సింగ్ నగర్ ప్రాంతానికి రెండో ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని స్పష్టం చేసారు, రైల్వే శాఖకు ప్రతిపాదన పంపినట్లయితే, ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే మిగిలిన భాగాన్ని వారు కూడా నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సూచించారని...

విజయవాడ నగర అభివృద్ధి దృష్ట్యా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని సెకండ్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం తెలుపాలని ప్రభుత్వాన్ని బలంగా కోరారు, ప్రజల ప్రయాణ సౌలభ్యం –– నగర అభివృద్ధి –– ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సెకండ్ ఫ్లైఓవర్ నిర్మాణమే సరైన దారి అని బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.

## ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

**గాంధీనగర్ ఫిబ్రవరి 26 మనం న్యూస్ :** ప్రజల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్న ఇంటి పన్నులు రూపాయికి ఎనిమిది పైసలు చొప్పున గ్రంథాలయ పన్ను స్థానిక సంస్థలు వసూలు చేసుకుని గ్రంథాలయ నిధులకు జమ చేయకుండా తమ స్వలాభాలకు వాడుకోవటం చట్ట విరుద్ధమని జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా కల్లేపల్లి మధుసూదన రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు వెంకటరమణ, కన్వీనర్ కోన దేవదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ విధమైన బకాయిలు దాదాపు 500 కోట్ల రూపాయలు స్థానిక సంస్థల వద్ద పెండింగ్లో ఉన్నాయి వాటిని నిలిపివేయటం వలన గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చే గ్రంథాలయ పన్ను ప్రజలకు అవసరమైన విజ్ఞానపరమైన సౌకర్యాలు పుస్తకాల కొనుగోలు చేయాలి కానీ అది ఎండమావే.. ఇంకా అతి పెద్ద దారుణం (కుంభకోణం) ఉద్యోగులజీతాలు పెన్షన్ల ప్రభుత్వం ఇవ్వవలసిన గ్రాంట్ ని నిలుపుదలచేసి ప్రజలనుండి వసూలు అయిన అరకొర సెస్సును జీతాలకు మళ్లించటం.. అలా ప్రభుత్వం అడ్వాన్స్ గా వాడుకున్న గ్రంథాలయ శేషు తిరిగి వెనక్కు గ్రంథాలయ నిధులకు జమ చేయకుండా వందలకోట్లు మాఫీ చేయటం సొమ్ము దుర్వినియోగం చేసి ప్రజలను మోసం చేయటం గ్రంథాలయ వ్యవస్థను భూస్థాపితం చేయటమేనని పేర్కొన్నారు. (ఉదాహరణకు జీతాలు, పెన్షన్లు గ్రాంటు సంవత్సరానికి 150 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది కేవలం 36 కోట్లు మిగిలిన 115 కోట్లు సెస్సు నుండి అడ్వాన్స్ చేశారు. అవి తిరిగి చెల్లించటం లేదు.) 2008 సంవత్సరంలో ఉద్యోగ సంఘాలవి జ్ఞాపన మన్నించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్రెడ్డి ఆదేశాలతో పెండింగ్ బకాయిలు క్లియర్ చేశారు. కానీ ఆ తరువాత నుండి ఇప్పటివరకు కొన్ని వందలకోట్ల రూపాయలు అడ్వాన్స్ చేసి వాడుకొన్న ప్రజలసొమ్మును తిరిగి గ్రంథాలయ సంస్థ నిధులకు జమ చేయలేదని, ఈ విపత్కర పరిస్థితి వలన ఉద్యోగులు పెన్షనర్ల జీతాలు పుస్తకాలకొనుగోలు పత్రికలనెలవారి బిల్లులు కరెంటు చార్జీలు స్వీపర్ బీడీసీలజీతాలు తదితరాలన్నీ చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం సంబంధిత అధికారులతీవ్ర నిర్లక్ష్యం గ్రంథాలయ వ్యవస్థపై చిన్న చూపు వెరసి గ్రంథాలయాలను శిథిలావస్థకు చేరుస్తున్నాయని తెలియజేశారు. దీనిపై ప్రజలు స్పందించాలి అన్ని పార్టీలకు అతీతంగా రాజకీయ పెద్దలు జోక్యం చేసుకోవాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కార్యదర్శులు తక్షణ చర్యలు తీసుకొని గ్రంథాలయ వ్యవస్థకు పూర్వ వైభవం తేవాలి లేదంటే భావితరాలు సమాజం మిమ్ములను క్షమించదని వారు తెలియజేశారు.

## తెలుగు యువత రాష్ట్రప్రధాన కార్యదర్శి నూతులపాటి భౌతికకాయానికి నివాళి

### టిడిపికి తీరని లోటు ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 26 (మనం న్యూస్)**తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , టి.ఎన్.ఎస్.ఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి ఎంపీ కేశినేని శివనాథ్ టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. పటమటలంక లోని బృందావన్ అపార్ట్మెంట్స్ లో నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి గరువారం ఉదయం ఎంపీ కేశినేని శివనాథ్ సందర్శించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకురాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. నాగభూషణం పార్టీ కి చేసిన సేవలను గుర్తు చేశారు. పార్టీ అండగా వుంటుందని కుటుంబ సభ్యులకి భరోసా ఇచ్చారు. నూతులపాటి నాగభూషణంకు నివాళులర్పించిన వారిలో ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జా అజేయ్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 60వ డివిజన్ వాంబే కాలనీలో ఎల్ డి ఏ చర్చ్ నూతన ప్రార్థనా మందిర ప్రారంభోత్సవ చేసిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ



**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 26 మనం న్యూస్ :** ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా నిలబడే నాయకుడే నిజమైన నాయకుడు , క్రైస్తవ సోదరులకు ఎప్పుడూ చేరువగా ఉంటూ సేవలందిస్తున్న బొండా ఉమా గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్ వాంబే కాలనీ జు బ్లాక్ నందు ఎల్ డి ఏ చర్చ్ నూతన ప్రార్థనా మందిర ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొండా సిద్దార్థ విచ్చేసి నూతన ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా బొండా సిద్దార్థ మాట్లాడుతూ:– సెంట్రల్ నియోజకవర్గంలో క్రైస్తవ సోదరులు చర్చి లేదా ఫెలోషిప్ సెంటర్ నిర్మించుకోవాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చేదని, కార్పొరేషన్ అనుమతులు, పోలీస్ పర్మిషన్లు, అధికారుల ఆటంకాలు వంటి సమస్యలు తరచుగా ఎదురయ్యేవని, ముఖ్యంగా క్రిస్మస్ వంటి పర్వదినాల సమయంలో రోడ్డుపై ప్రార్థనలు నిర్వహించేందుకు కూడా అనేక అడ్డంకులు ఉండేవని గుర్తు చేశారు.. అయితే 2014లో ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బొండా ఉమామహేశ్వరరావు కులమతాలకు అ–తీతంగా మైనారిటీలకు అండగా నిలవాలనే సంకల్పంతో ముందుకు వచ్చారని, ఆ దిశగా క్రైస్తవ సోదరులకు ప్రార్థనా మందిరాల నిర్మాణంలో పూర్తి సహకారం అందించారని... సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దాదాపు 30కు పైగా కొత్త చర్చిలు నిర్మించబడగా, ఇంకా ఎన్నో స్థలాల కేటాయింపులు, ఫెలోషిప్ సెంటర్ల ఏర్పాట్లు జరిగాయని, మీరు ధైర్యంగా ముందుకు వెళ్లండి, మీకు నేను అండగా ఉంటాను అని స్పష్టంగా చెప్పి నిర్మాణ ప్రక్రియలు సాఫీగా సాగేందుకు చర్యలు తీ స ు కు న్నా ర ని . . సె ం ట్ర ల్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకుడిగా బొండా ఉమా సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలియజేసారు...

ఈ కార్యక్రమంలో:– క్లస్టర్ ఇంచార్జ్ కంచి ధన శేఖర్, పాస్టర్ గోపిశెట్టి రత్నబాబు, పాస్టర్ ప్రసాద్ దైవర్తమానికులు నూతి రామన్నపాలెం, డాక్టర్ విద్యాసాగర్ రిటైర్డ్ బాయింట్ డైరెక్టర్(గూం)ఎన్టీఆర్ డిస్ట్రిక్, శ్రీ కోట జయశ్రీ కరూర్ వైశ్యా బ్యాంక్, స్టేట్ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ దివి ఉమామహేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు బెవర సూర్య, ప్రధాన కార్యదర్శి కంచేటి నాగరాజు, ఇంచార్జ్ వీ మల్లేశ్వరరావు, బుగత శ్రీరాములు, ధర్మాన రాము తదితరులు పాల్గొన్నారు...